ఆదివారం 28-4-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 318, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## రోజుకు పదిసార్లు కరెంటు పోతోంది

**నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు చెప్పారు ● ఎక్స్ (ట్విటర్) వేదికగా తెలిపిన కేసీఆర్**




**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు పోవడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రతి రోజూ ఊదరగొడుతున్నారని, వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో తాను భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంట్ పోయిందని ఎక్స్ (ట్విటర్) వేదికగా తెలిపారు. నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతోందని మాజీ ఎమ్మెల్యేలు ఆ సందర్భంగా తనతో చెప్పినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయని కేసీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలని భారాస అధినేత విజ్ఞప్తి చేశారు.



## ఉద్యోగిగా చేరిన కంపెనీకే సీఈఓ అయ్యాడు

02



## ఐటీ రంగంలో 69 వేల ఉద్యోగాలు పోయాయి

02

## నేను రాజకీయాల్లోకి రావాలని దేశం కోరుకుంటోంది

**ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా కీలక వ్యాఖ్యలు**



**ముందడుగు జాతీయం:**

తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని దేశమంతా కోరుకుంటోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. రాబర్ట్ వాద్రా ఉత్తరప్రదేశ్‌లోని అమేథి స్థానం నుంచి పోటీ చేస్తారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అక్కడ ఇటీవలే వాద్రా పోస్టర్లు కూడా వెలిశాయి. 'అమేథి ప్రజలు ఈసారి రాబర్ట్ వాద్రాను కోరుకుంటున్నారు' **మిగతా 2లో**



## హెలికాప్టర్‌లో జారీ పడిపోయిన మమతా బెనర్జీ

**స్వల్ప గాయం, కొనసాగించిన ప్రయాణం**

## ఉద్యోగిగా చేరిన కంపెనీకే సీఈఓ అయ్యాడు

02

**20 ఏళ్ల గూగుల్ ప్రస్థానంపై సుందర్ పిచాయ్ పోస్ట్**

## పురీషనాళంలో దాచిన 70లక్షల బంగారం

**977 గ్రాముల 24 క్యారెట్ల బంగారం సీజ్**

**ముందడుగు తమిళనాడు:**

దుబాయ్ నుంచి వస్తున్న ఓ ప్రయాణికుడి వద్ద నుంచి 977 గ్రాముల 24 క్యారెట్ల బంగారాన్ని సీజ్ చేశారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి విమానాశ్రయంలో అధికారులు సుమారు 70 లక్షల ఖరీదైన బంగారాన్ని పట్టుకున్నారు. అయితే ఆ బంగారాన్ని మూడు ప్యాకెట్లలో పురీషనాళంలో అతను దాచిపెట్టాడు. పేస్ట్ తరహాలో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో దుబాయ్ నుంచి తిరుచ్చి విమానాశ్రయానికి అతను ప్రయాణించాడు. ఆ ప్రయాణికుడిని అరెస్టు చేసి తదుపరి విచారణ చేపడుతున్నారు. ప్రయాణికుడు పురీషనాళంలో బంగారం దాయడంతో అధికారులే ఆశ్చర్యపోయారు.



## నేను రాజకీయాల్లోకి రావాలని
# దేశం కోరుకుంటోంది

**మొదటిపేజీ తరువాయి**

అంటూ స్థానికంగా ఉన్న పార్టీ కార్యాలయం సమీపంలో పోస్టర్లు కనిపించడం చర్చకు దారి తీసింది. దీంతో అమేథిలో వాద్రా పోటీ ఖాయమని అంతా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన రాజకీయ రంగ ప్రవేశంపై రాబర్ట్ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని దేశమంతా కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల నుంచి తనకు విజ్ఞప్తులు కూడా అందుతున్నాయని వెల్లడించారు.



అమేథి సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇరానీ తన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. 'ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీని వదిలించుకోవాలని చూస్తున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేస్తున్న కృషిని దేశ ప్రజలు గుర్తించారు. అందుకే ప్రజలంతా గాంధీ కుటుంబంతోనే ఉన్నారు. అమేథి నియోజకవర్గ ప్రజలతో నాకు 1999 నుంచి అనుబంధం ఉంది. అప్పటి నుంచి కాంగ్రెస్ తరపున నేను ఇక్కడ ప్రచారం చేస్తున్నాను. గత సార్వత్రిక ఎన్నికల్లో అక్కడి నుంచి గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టిన బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ అమేథి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు' అని రాబర్ట్ వాద్రా పేర్కొన్నారు.

## హెలికాప్టర్‌లో జారీ పడిపోయిన
# మమతా బెనర్జీ

**ముందడుగు పశ్చిమ బెంగాల్:**

ఎన్నికల ప్రచారానికి వెళ్లేందుకు హెలికాప్టర్ ఎక్కిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అదుపుతప్పి జారీ కింద పడిపోయారు. ఈ మధ్యాహ్నం పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని దుర్గాపుర్ నుంచి దీదీ అసన్‌సోల్ వెళ్లేందుకు హెలికాప్టర్ ఎక్కారు. లోపలికి వెళ్లి సీట్లో కూర్చునే సమయంలో ఆమె బ్యాలెన్స్ కోల్పోయి కిందపడ్డారు. దీన్ని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే సాయం చేశారు. ఈ ఘటనలో ఆమెకు స్వల్ప గాయమైందని, అయినప్పటికీ సీఎం తన ప్రయాణాన్ని కొనసాగించారని అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. అసన్‌సోల్ స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ నుంచి అలనాటి నటుడు, ఎంపీ శతృఘ్నసిన్హా పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా మమతా బెనర్జీ నేడు ప్రచారం చేపట్టారు. గత నెల దీదీ తన ఇంట్లోనే జారిపడటంతో నుదుటిపై తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. మమత నుదుటి నుంచి రక్తం కారుతున్న ఫొటోను పార్టీ విడుదల చేసింది. ఆ తర్వాత తలకు కట్టుతోనే ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక, 2023 జూన్‌లోనూ ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణం కారణంగా తీవ్ర కుదుపులకు లోనైంది. దీంతో అత్యవసరంగా హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయగా.. అందులో నుంచి కిందకు దిగుతూ దీదీ గాయపడ్డారు. ఆమె మోకాలు, తుంటి లిగ్‌మెంట్లకు గాయాలయ్యాయి.

## ఉద్యోగిగా చేరిన కంపెనీకే
# సీఈఓ అయ్యాడు

**ముందడుగు జాతీయం:**

గూగుల్‌లో ఉద్యోగిగా భారత్ నుంచి వెళ్లిన ఓ కుర్రాడు ఏకంగా ఆ కంపెనీకే సీఈఓ అయ్యాడు. ఇప్పుడు కంపెనీ నడిపించే స్థాయికి ఎదిగాడు. ఆయనే సుందర్ పిచాయ్. తన 20 ఏళ్ల గూగుల్ ప్రస్థానాన్ని వెల్లడిస్తూ తాజాగా ఇన్‌స్టాగ్రాంలో పెట్టిన పోస్టు ఆకట్టుకుంటోంది.

ఏప్రిల్ 26, 2004.. గూగుల్‌లో నాకు మొదటిరోజు. అప్పటి నుంచి ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతికత, మా ఉత్పత్తులను వినియోగించే వారి సంఖ్య..ఇలా ఎంతో మారింది. అలాగే నా జుట్టు కూడా. ఈ 20 ఏళ్లలో మారని అంశం ఒకటి ఉంది. ఆ అద్భుతమైన కంపెనీలో పనిచేస్తున్నప్పుడు నేను పొందే థ్రిల్ ఇప్పటికీ మారలేదు. ఇందులో భాగమైనందుకు నేను ఎంతో అదృష్టవంతుడినని భావిస్తున్నాను'' అంటూ '20' నంబర్ ఉన్న చిత్రాన్ని షేర్ చేశారు. 2004లో ప్రొడక్ట్ మేనేజర్‌గా చేరిన నాటిది, ప్రస్తుత ఐడీ కార్డును పంచుకున్నారు. ఈ పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. మీ జుట్టు తగ్గింది.. గూగుల్ ఆదాయం పెరిగిందని ఒకరు చమత్కరించారు. మీరు నా రోల్ మోడల్ సర్, మీ నిబద్ధత గొప్పది అంటూ మరికొందరు పోస్టులు పెట్టారు.

ఒక సాధారణ ఉద్యోగిగా గూగుల్‌లోకి అడుగుపెట్టిన సుందర్ పిచాయ్ ఆ సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. గూగుల్ క్రోమ్, ఆండ్రాయిడ్, గూగుల్ డ్రైవ్ ఇలాంటి గొప్ప గొప్ప ఆవిష్కరణలన్నీ ఆయన ఆలోచనల నుంచే పుట్టుకొచ్చాయి. ఆ కష్టానికి ప్రతిఫలంగా 2015లో ఆయనకు సీఈవో పదవి దక్కిన సంగతి తెలిసిందే.

# జైల్లో కేజ్రీవాల్ పూర్తి ఆరోగ్యంగానే ఉన్నారు

**ఎయిమ్స్ వైద్యులు ధ్రువీకరించినట్లు సమాచారం**

**ముందడుగు ఢిల్లీ:**



తీహార్ జైల్లో టైప్2 డయాబెటీస్‌తో బాధ పడుతున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఈ క్రమంలోనే కోర్టు ఆదేశాల మేరకు ఎయిమ్స్‌కు చెందిన ఐదుగురు సభ్యుల మెడికల్ బోర్డు శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆయన పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు ధ్రువీకరించినట్లు తెలుస్తోంది. దాదాపు అరగంట పాటు ఎయిమ్స్ వైద్యులు సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కేజ్రీవాల్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న మందులనే కొనసాగించాలని మెడికల్ బోర్డు సూచించింది. మెడిసిన్‌లో మార్పులు చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. దీంతో పాటు ఆయనకు రెండు యూనిట్ల ఇన్సులిన్ డోసును కొనసాగించాలని తెలిపింది'' అని సదరు వర్గాలు వెల్లడించాయి. వారం తర్వాత ఈ బృందం సీఎంను మరోసారి పరీక్షించనున్నట్లు పేర్కొన్నాయి.

తన వ్యక్తిగత వైద్యుడితో రోజూ వీడియో మాధ్యమంలో సంప్రదించే అవకాశాన్ని కల్పించాలని ఇటీవల కేజ్రీవాల్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీన్ని ఈడీ వ్యతిరేకించింది. ఆరోగ్య కారణాల కింద బెయిల్ పొందేందుకే చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటున్నారని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. దీనిపై వాదనలు విన్న న్యాయస్థానం.. కేజ్రీవాల్ అభ్యర్థనను తోసిపుచ్చింది. అయితే, ఆయనకు క్రమం తప్పకుండా ఇన్సులిన్ అవసరమా?, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని పరీక్షించేందుకు వైద్యుల కమిటీని ఏర్పాటుచేయాల్సిందిగా దిల్లీ ఎయిమ్స్‌ను ఆదేశించింది. ఈ కమిటీ తాజాగా ఆయన ఆరోగ్య పరిస్థితిని పరీక్షించింది.

## ప్రభుత్వ ఉద్యోగి అవినీతి..
# రాజ్య వ్యతిరేక నేరమే

**సుప్రీం కోర్టు**

**ముందడుగు, న్యూఢిల్లీ**

ప్రభుత్వ ఉద్యోగి చేసే అవినీతిని రాజ్యానికి, సమాజానికి వ్యతిరేకంగా చేసిన నేరంగానే చూడాలని సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది. డబ్బులు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని మోసం చేసిన నిందితులకు సంబంధించిన క్రిమినల్ కేసును సంబంధిత కక్షిదారుల మధ్య రాజీ కుదిరిందన్న కారణంతో మద్రాసు హైకోర్టు కొట్టివేయడాన్ని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం తప్పు పట్టింది.హైకోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టి నిందితులపై క్రిమినల్ ఫిర్యాదును మళ్లీ తెరవాలని ఆదేశించింది.డబ్బులతో ప్రభుత్వ ఉద్యోగాలను కొనేవారు తిరిగి ఆ మొత్తం సంపాదించడానికి అవినీతికి పాల్పడతారని దీంతో పరోక్షంగా ప్రజలు బాధితులు అవుతారని అందువల్ల ఇలాంటి కేసుల్లో నిందితులను ఉపేక్షించ కూడదని ధర్మాసనం పేర్కొంది.

# ఐటీ రంగంలో 69 వేల ఉద్యోగాలు పోయాయి

**ఒక్క ఇన్ఫోసిస్‌లోనే 25,994 జాబులు తగ్గాయి ● ఉద్యోగార్థుల్లో మొదలైన కలవరం**

**ముందడుగు జాతీయం:**

సాధారణంగా ఐటీలో ఎప్పుడూ ఉద్యోగుల సంఖ్య పెరగడమే కానీ తగ్గడం అంటూ ఉండదు. అలాంటిది ఒక్క హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ మినహా మిగిలిన ప్రధాన ఐటీ కంపెనీల్లో ఇదే ధోరణి కనిపిస్తోంది. దేశంలోని ప్రధాన ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య నానాటికీ క్షీణిస్తోంది. 202324 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 69 వేల మేరకు ఉద్యోగుల సంఖ్య క్షీణించింది. ఇటీవల ఆయా కంపెనీలు వెలువరించిన త్రైమాసిక ఫలితాల సందర్భంగా ఈవిషయం వెల్లడైంది. ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడమే దీనికి కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. టాటా కన్సల్టెన్సీ



సర్వీసెస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా ఇటీవల త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. ఆయా సంస్థల లాభనష్టాలతో పాటు ఉద్యోగుల సంఖ్యను కూడా ప్రకటించాయి. ఈ గణాంకాలను గమనిస్తే.. మొత్తంగా 69,167 మంది ఉద్యోగులు తగ్గినట్లు తెలుస్తోంది. టీసీఎస్‌లో 13,249 మంది, విప్రోలో 24,516, ఇన్ఫోసిస్‌లో 25,994, టెక్ మహీంద్రాలో 6,945 మేర ఉద్యోగుల తగ్గుదల నమోదైంది. ఒక్క హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో మాత్రమే ఉద్యోగుల సంఖ్య 1,537 మేర పెరిగింది. అంటే టాప్5 కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య పెరిగింది ఒక్క హెచ్‌సీఎల్‌లో మాత్రమే. ఈ పరిస్థితి ఉద్యోగార్థులను కలవరపెడుతోంది. ఓవైపు ఉద్యోగుల సంఖ్య తగ్గిన వేళ.. మళ్లీ ఫ్రెషర్లను నియమించుకోవడంపై ఆయా కంపెనీలు దృష్టి సారిస్తుండడం ఊరట కల్పించే అంశం. 202425 ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ సుమారు 40 వేల మందిని, హెచ్‌సీఎల్ 10 వేల మంది, టెక్ మహీంద్రా 6 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ప్రకటించాయి.

ముందడుగు
ఆదివారం,
28-4-2024,
హైదరాబాద్

# అందాల పోటీల్లో 60 ఏళ్ల భామకు కిరీటం

## అందంతో కుర్రకారు మతిపోగొడుతోన్న ఈ భామ

**ముందడుగు జాతీయం:**






అందాల పోటీలధ అర్జెంటీనాకు చెందిన అలెజాంద్రా మరీసా రొడ్రిగోజ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆరు పదుల వయసులో అందంతో కుర్రకారు మతిపోగొడుతోన్న ఈ 'భామ'.. తాజాగా మిస్ యూనివర్స్ ప్రాతినిధ్యం కోసం జరుగుతున్న పోటీల్లో కిరీటం దక్కించుకున్నారు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో ఇటీవల అందాల పోటీలు జరిగాయి. ఇందులో లా ప్లాటా నగరానికి చెందిన 60 ఏళ్ల అలెజాంద్రా 'మిస్ యూనివర్స్ బ్యూనస్ ఎయిర్స్' టైటిల్ గెలుచుకున్నారు. అందాల పోటీల్లో ఈ వయసులో కిరీటం పొందిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. వృత్తిరీత్యా న్యాయవాది, జర్నలిస్టు అయిన అలెజాంద్రా.. సంకల్పానికి వయసు అడ్డు కాదని నిరూపించారు. అందానికి సరికొత్త నిర్వచనమిచ్చారు. ఈ ఏడాది మే నెలలో జరగబోయే 'మిస్ యూనివర్స్ అర్జెంటీనా' పోటీల్లో ఈమె బ్యూనస్ ఎయిర్స్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అక్కడ గెలిస్తే సెప్టెంబరులో మెక్సికో వేదికగా జరిగే 'విశ్వ సుందరి 2024' పోటీల్లో తన దేశం తరఫున పాల్గొంటారు. ఈ అందాల రాణి ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థులకు వయోపరిమితిని తొలగిస్తూ 'మిస్ యూనివర్స్' ఆర్గనైజేషన్ గతేడాది నిర్ణయం తీసుకుంది. గతంలో ఈ అందాల పోటీలో 1828 ఏళ్ల వయసున్న మహిళలే పాల్గొనే వీలుండేది. ఈ ఏడాది నుంచి 18 ఏళ్లు పైబడిన యువతులందరికీ అవకాశం కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన 47 ఏళ్ల హైదీ క్రూజ్ ఆ దేశ అందాల కిరీటం గెల్చుకున్నారు. ఈ ఏడాది విశ్వసుందరి పోటీల్లో ఆమె తన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

# పరీక్షలో జై శ్రీరామ్ అని రాస్తే పాస్ చేశారు

## యూపీ యూనివర్సిటీలో డీ - ఫార్మసీ భాగోతం

**ముందు ఉత్తరప్రదేశ్:**



విద్యార్థులు చాలా మంది పరీక్షల్లో జవాబులు రాకుంటే ఏదో ఒక స్టోరీ రాస్తారు. కానీ ఒక విద్యార్థి మాత్రం కాస్త డిఫరెంట్ గా ఆలోచించి దేవుడి పేరు రాసి పరీక్ష పాస్ అయ్యాడు. ఈ విచిత్ర ఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరిగింది. యూపీ యూనివర్సిటీలో డీ ఫార్మసీ మొదటి సంవత్సరం పరీక్షలు జరగగా.. ఈ పరీక్షల్లో కొందరు వ్యక్తులు జవాబు పత్రాల్లో జై శ్రీరామ్ నినాదాలతో పాటు, హార్దిక్ పాండ్యా, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి క్రికెటర్ల పేర్లను రాశారు. అలా రాసిన సదరు విద్యార్థులు 60 శాతం మార్కులతో పాస్ అయ్యారు.

యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో.. విద్యార్థి నాయకుడు దివ్యాంశు సింగ్ ప్రధాని, ముఖ్యమంత్రి, గవర్నర్, వైస్ ఛాన్సలర్‌లకు లేఖ రాశారు. కొందరు ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది కుమ్మక్కై సున్నా మార్కులు రావాల్సిన విద్యార్థులను కూడా ఫస్ట్ క్లాస్‌లో పాస్ చేశారని ఆరోపించాడు. అంతేకాదు ఆర్టీఐ చట్టం క్రింద జవాబు పత్రాలను పరిశీలన చేయాలని కోరాడు. దీంతో అసలు భాగోతం బయటపడింది. దీనిపై యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వందనా సింగ్ రియాక్ట్ అవుతూ.. విద్యార్థులు అక్రమ మార్గంలో ఉత్తీర్ణత సాధించారన్న విషయం తమ దృష్టికి రాగానే దీనిపై ఓ కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించామని, ఆ కమిటీ నివేదికలో విద్యార్థులకు ఎక్కువ మార్కులు కేటాయించినట్లు తేలిందని చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిణామాలు మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వందే భారత్ రైళ్లలో అరలీటరు నీళ్ల సీసాలు

## నీటివృథాను అరికట్టేందుకే నిర్ణయమని వెల్లడి

**ముందడుగు జాతీయం:**




దేశంలోని అన్ని ప్రధాన నగరాలను కలుపుతూ మినీ హైస్పీడ్ వందే భారత్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. నీటివృథాను అరికట్టేందుకే రైళ్లలో అరలీటరు సీసాలు మాత్రమే ఇవ్వాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వందేభారత్‌తోపాటు శతాబ్ధి ఎక్స్ ప్రెస్ రైళ్లల్లో కూడా లీటరు సీసాల స్థానంలో అరలీటరు సీసాలు దర్శనమివ్వబోతున్నాయి. కొన్ని పరిమిత స్టేషన్లలో మాత్రమే వందేభారత్ రైళ్లు ఆగుతాయి. బయట నుంచి ఆహారం కొనుగోలు చేయాలంటే ప్రయాణికులకు బాగా ఇబ్బందిగా ఉంటోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే ప్రయాణికులు ఆహార పదార్థాలకు సంబంధించి ఆర్డర్ పెట్టుకునే సదుపాయాన్ని కల్పించారు. సీటు వద్దకే భోజనం వస్తుంది. భోజనంతో పాటు లీటరు సీసాలు అందిస్తుంటే కొందరు సగం తాగి వదిలేస్తున్నారు. దాదాపుగా అందరూ ఇలానే చేస్తుండటంతో నీటి వృథాను అరికట్టేందుకు ఇకనుంచి అరలీటరు సీసాలు ఇవ్వాలని నిర్ణయించారు. వందే భారత్ రైళ్లల్లో టికెట్‌తోపాటు బుక్ చేసుకున్న ఫుడ్ ధర ఎక్కువగా ఉంటోందని విమర్శలు వస్తున్నాయి. టికెట్ ధరలే ఎక్కువగా ఉంటుంటే వాటికితోడుగా ఫుడ్ ధరలు కూడా భారీగా ఉన్నాయని, వాటిని వెంటనే తగ్గించాలని రైల్వే యూజర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# మూడు నెలల వరకు పెళ్లి ముహూర్తాలు లేవు

## వస్త్ర, వ్యాపారాలకు తగ్గనున్న గిరాకీ

**ముందడుగు జాతీయం:**




ప్రస్తుతం ఎంగేజ్ మెంట్ చేసుకున్నవారు, పెళ్లి చేసుకోవాలనుకునే వారు మరో మూడు నెలల పాటు ఆగాల్సిందే. ఎందుకంటే మరో మూడు నెలల వరకు ముహూర్తాలు లేవు. శనివారం నుంచి మూఢం ప్రారంభమైనట్లు జ్యోతిష్యులు చెబుతున్నారు. ఈ మూడు నెలలు గ్రహయోగ దోషం ఉంటుందని.. అందుకే పెళ్లిళ్లకు ముహూర్తలు ఉండవని వివరిస్తున్నారు. గ్రహాల స్థితి, రాశుల కదలికను బట్టి మూఢం ఉంటుందని పేర్కొంటున్నారు. హిందూ జ్యోతిష్య శాస్త్రం ప్రకారం శుక్రుడు సూర్యుడికి సమీపంలో ఉన్నప్పుడు, అలాగే గురు గ్రాహం కూడా సూర్యుడికి సమీపంలో ఉన్నప్పుడు మూఢంగా పేర్కొంటారు. ఈ సమయంలో శుభకార్యాలు నిర్వహించేలమని జ్యోతిష్యులు స్పష్టం చేస్తున్నారు. తిరిగి ఆశ్వయుజ మాసంలో మంచి ముహూర్తలు ఉంటాయని చెబుతున్నారు.

పెళ్లిలు లేకుంటే చాలా వ్యాపారాలు నెమ్మదిస్తాయి. ముఖ్యంగా వస్త్ర, వ్యాపారాలకు అంతగా గిరాకీ ఉండదు. ముఖ్యంగా ఈ మూడు నెలల కాలంలో ఎలాంటి పండుగలు కూడా లేవు. దీంతో బట్టల దుకాణాలకు గిరాకీ భారీగా తగ్గొచ్చు.

# వినయ్ వీర్ మరణం జర్నలిజానికి తీరని లోటు

## సీఎం రేవంత్ రెడ్డి

**ముందడుగు, స్టేట్ బ్యూరో:**



ప్రముఖ జర్నలిస్టు, హిందీ మిలాప్ సంపాదకులు వినయ్ వీర్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. వినయ్ వీర్ మరణం పట్ల పత్రికా రంగానికి ముఖ్యంగా హిందీ జర్నలిజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రముఖ స్వతంత్ర సమర యోధుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు యుధ్ వీర్ కుమారుడైన వినయ్ వీర్ దక్షిణాదిన హిందీ జర్నలిజంలో ఎనలేని సేవలు అందించారని స్మరించుకున్నారు. ఫోటో జర్నలిస్టుగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఆయన మరణం పట్ల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముందడుగు
ఆదివారం, 28-4-2024, హైదరాబాద్

# అగ్ని ప్రమాదం కుటుంబాలకు సహాయం

## ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూత



**ములుగు ముందడుగు:**

ములుగు మండలం కొత్తూరు గ్రామంలో రెండు పేద వడ్డెర కుటుంబాలకు చెందిన ఇళ్లు శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రెండు కుటుంబాలకు నెల రోజులకు సరిపోయే బియ్యం, పప్పు, నూనె తదితర నిత్యావసర కిరాణ వస్తువులు, బ్లాంకెట్లు, దుప్పట్లు, దుస్తులు, వంట పాత్రలు ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పింగిలి నాగరాజు ఆధ్వర్యంలో అందజేయడం జరిగినది. ఆపద సమయంలో అదుకున్నందుకు పింగిలి నాగరాజుకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.

# సామాజిక వర్గం కాదు సమాజమే ముఖ్యం

## జై భారత్ పార్టీ అధ్యక్షులు జెడి లక్ష్మినారాయణ


**ముందడుగు విశాఖపట్నం:**




నాకు సామాజిక వర్గం ముఖ్యం కాదు, సమాజమే ముఖ్యమని జై భారత్ పార్టీ అధ్యక్షులు జెడి లక్ష్మి నారాయణ అన్నారు. ఆక్సిజన్ టవర్స్ లో ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఎంత బిజీగా ఉన్నా కూడా, బాధ్యతగా సమాజంలో సైబర్ క్రైమ్ బారిన పడకుండా తగు జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. విశాఖ ఉత్తర నియోజక వర్గాన్ని, ఉత్తమ నియోజక వర్గంగా అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భారత్ మహిళా నాయకులు అను, మాధవీలత, ఆక్సిజన్ టవర్ ఇన్చార్జి రమేష్, బృందావన్ పార్క్ ప్రెసిడెంట్ ప్రసన్న, అడ్వకేట్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

# మారుతీ నుంచి త్వరలో హైబ్రిడ్ కార్లు

- అందుబాటు ధరలకే తీసుకొచ్చేందుకు సన్నాహాలు
- మారుతీ సుజుకీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ వెల్లడి




**ముందడుగు జాతీయం:**

అందరికి అందుబాటు ధరలకే దేశంలో హైబ్రిడ్ కార్లను తీసుకొచ్చేందుకు దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ సన్నాహాలు చేస్తుంది. అందుకోసం జపాన్‌కు చెందిన సుజుకీ కంపెనీ చిన్నపాటి హైబ్రిడ్ కార్ల తయారీపై పని చేస్తోంది. ఈవిషయాన్ని మారుతీ సుజుకీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కార్ల కంటే ఎక్కువ మైలేజీతో ఇవి రానున్నాయని తెలిపారు. మారుతీ సుజుకీ త్రైమాసిక ఫలితాల వెల్లడి అనంతరం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు.టయోటా హైబ్రిడ్ కార్లలో వినియోగిస్తున్న సాంకేతికత ఖర్చుతో కూడుకున్నదని ఆర్‌సీ భార్గవ ఈసందర్భంగా పేర్కొన్నారు. దీనివల్ల హైబ్రిడ్ కార్ల ధరలు ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. దీంతో తక్కువ ఖర్చుతో నడిచే హైబ్రిడ్ కార్లను తీసుకురావాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందుకోసం చిన్నపాటి హైబ్రిడ్ కార్ల టెక్నాలజీపై సుజుకీ పని చేస్తోందని తెలిపారు. హైబ్రిడ్ కార్లపై జీఎస్టీని తగ్గించాలని కోరారు. అప్పుడే అందుబాటు ధరలో మెరుగైన హైబ్రిడ్ కార్లను దేశీయ రోడ్లపై చూడడం సాధ్యపడుతుందన్నారు.

# అమెరికా సౌత్ కరోలినాలో రోడ్డు ప్రమాదం

## ముగ్గురు భారతీయ మహిళలు దుర్మరణం



**ముందడుగు అమెరికా:**

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సౌత్ కరోలినాలో జరిగిన ఈ దుర్ఘటనలో ముగ్గురు భారతీయ మహిళలు మృతి చెందారు. వారంతా గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందిన వారని స్థానిక అధికారులు తెలిపారు. మృతుల పేర్లు రేఖాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మనీశాబెన్ పటేల్.

''వారు ప్రయాణిస్తున్న వాహనం పరిమితికి మించిన వేగంతో ప్రయాణించినట్లు తెలుస్తోంది. ఇంత వేగంతో ప్రయాణించడం చాలా అరుదుగా చూస్తాం'' అని అధికారులు తెలిపారు. దాని వల్ల అదుపుతప్పిన ఎస్‌యూవీ.. రహదారిపై 46 వరుసలు పల్టీ కొడుతూ చెట్లపైకి ఎగిరిపడి, ఇరుక్కుపోయింది. ఆ సమయంలో గాల్లోకి 20 అడుగుల ఎత్తుకు లేచినట్లు తెలుస్తోంది. దీనిపై వెంటనే సమాచారం అందుకున్న అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తిని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.




# ఏప్రిల్ 29న "వంశీ తిరుమలా బ్యాంక్ ఉగాది కామధేను పురస్కారాలు

**ముందడుగు హైదరాబాద్ :**

1972 నుండి వివిధ రంగాలలో సేవలందిస్తున్న వంశీ ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్ మరియు గత 25 సంవత్సరాల నుండి బ్యాంకింగ్ రంగంలో సేవలు అందిస్తున్న తిరుమల బ్యాంక్ కలసి మొట్టమొదటిసారిగా తెలుగు ఉగాది సందర్భంగా "వంశీ తిరుమలా బ్యాంక్ ఉగాది కామధేను పురస్కారాలను" వివిధ రంగాలకు చెందిన 100 మంది దేశ విదేశీయ ప్రముఖులకు బహుకరించబోతున్నారు.

ఏప్రిల్ 29 రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో సాయంత్రం మూడు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఈ కార్యక్రమానికి తిరుమల బ్యాంకు ఫౌండర్ ఛైర్మన్ నంగనూరి చంద్రశేఖర్ అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమానికి భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ ప్రత్యక్షంగా హాజరై తమ ఆశీస్సులు అందించనున్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, విశిష్ట అతిథిగా శ్రీ మురళీమోహన్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ, సీనియర్ నటుల కోట శ్రీనివాసరావు, హీరో సుమన్, సినీనటి రోజారమణి, దర్శకులు రేలంగి నరసింహారావు, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, సిల్వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు తదితరులు హాజరు కానున్నారు.